క్లుప్తంగా

కాకర్ల భీమయ్యకు డాక్టరేట్



నారాయణపేట రూరల్: పట్టణానికి చెందిన అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా అధ్యక్షుడు కాకర్ల భీమయ్య 20 ఏళ్లుగా చేస్తున్న సామాజిక, ధార్మిక సేవలను గుర్తించి తమిళనాడు గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ వారు ఆయనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. శనివారం కన్యాకుమారి వివేకానంద కేంద్ర క్యాంపస్లో డాక్టరేట్ అవార్డును యూనివర్శిటీ చైర్మన్ మ్యానుల్, వైస్ చైర్మన్ వెంకటేషన్ చేతుల మీదుగా అందుకున్నారు.

మహేశ్వరి కుటుంబానికి ఆర్థికసాయం



మాగనూర్: జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో గత మంగళవారం బొలెరో వాహనం ఢీకొన్న ఘటనలో మండలంలోని గురువలింగంపల్లి గ్రామానికి చెందిన బిఎస్సీ నర్సింగ్ విద్యార్థిని మహేశ్వరి మృతి చెందింది. నిరుపేద కుటుంబం కావడంతో మహేశ్వరి కుటుంబ సభ్యులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి గ్రామస్తులు కొందరు ముందుకొచ్చి చందాల రూపంలో రూ.14 వేలు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ మహేశ్వరి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

భక్తిశ్రద్ధలతో హోమం, ప్రత్యేక పూజలు



మరికల్: మండల కేంద్రంలోని దత్తలింగేశ్వర స్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా శనివారం అర్చకులు 30 దంపతులతో భక్తిశ్రద్ధలతో హోమం కార్యక్రమాలను నిర్వహించారు. ఆదివారం ఆలయంలో శివపార్వతులు, కాలభైరవుడు, అభయ ఆంజనేయ స్వామి, నవగ్రహాలు, నాగదేవతల విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రతిష్ఠాపనోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

10 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



నర్వ: టాస్క్‌ఫోర్స్, పోలీసుల సంయుక్త దాడిలో 10 క్వింటాళ్ల పీడీఎస్ రైస్ పట్టుకున్నట్లు ఎస్ఐ కురుమయ్య తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని కల్వాల్ వద్ద అర్ధరాత్రి అక్రమంగా టాటా ఏస్ వాహనంలో రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించి 10 క్వింటాళ్ల బియ్యం పట్టుకోవడంతో పాటు రవాణా చేస్తున్న ఎరుకలి వెంకటేష్, పి.రాజు పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. అనంతరం డీటీ పంచనామతో వారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో అక్రమంగా పీడీఎస్ బియ్యం నిల్వ ఉంచినా.. రవాణా చేసినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు మద్దూరులో విద్యుత్ అంతరాయం

మద్దూరు: పట్టణంలో ప్రధాన రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాల తొలగింపు పనులు చేపట్టడంతో ఆదివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ నిరంజన్‌దాస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి ఒంటి గంట వరకు, సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఏపీఓగా లక్ష్మారెడ్డి

ఊట్కూరు: ఉపాధి హామీ పథకంలో ఏపీఓగా శనివారం లక్ష్మారెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఏపీఓగా విధులు నిర్వహిస్తున్న సత్యప్రకాష్ బదిలీపై మక్తల్‌కు వెళ్లగా.. ఆయన స్థానంలో లక్ష్మారెడ్డి వచ్చారు. ఆయన గతంలో ఊట్కూరు మండలంలో టీఏగా విధులు నిర్వహించినట్లు తెలిపారు.

వడగళ్ల వర్షం.. తీరని నష్టం

- రాలిన వరి ధాన్యం
- ఎకరాకు రూ. 20 వేల నష్టం

మరికల్: ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు కోతకు వచ్చిన దశలో శుక్రవారం రాత్రిలో కురిసిన వడగళ్ల వానకు ధాన్యం నేలరాలడంతో మండలంలో దాదాపు 325 ఎకరాలకు పైగా పంట నష్టం వాటిల్లింది. ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వర్షానికి కోయిల్‌సాగర్ ఆయకట్టు కింద పూసల్‌పహాడ్, రాకొండ, తీలేర్, పెద్దచింతకుంట, వెంకటాపూర్, తదితర గ్రామాల్లో కోతకు వచ్చిన వరి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేస్తే వడగళ్ల వర్షాల కారణంగా పంట మొత్తం నష్టపోయామని రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. దీంతో ఎకరాకు రూ. 20 వేల చొప్పున పంట నష్టం వాటిలింది. పంటల పెట్టుబడికి చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క ఎండిన ధాన్యం రాశులు కూడా పూర్తిగా తడిసిపోవడంతో రైతులు మళ్లీ ధాన్యం ఆరబెట్టేందుకు ఇబ్బందులు పడుతున్నారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని వారు ప్రాధేయపడుతున్నారు.



తీలేర్‌లో వడగళ్ల వానకు దెబ్బతిన్న వరి పంటను చూపిస్తున్న కౌలు రైతు



తీలేర్‌లో నేల రాలిన వరిధాన్యం



పెద్దచింతకుంటలో తడిసిన ధాన్యం

ఐదు ఎకరాల పంట నేలరాలింది



5 ఎకరాల కౌలుకు తీసుకొని వరి పంట సాగుచేశా. దీంతో ఆదివారం పంటను కోసేందుకు మిషన్ మాట్లాడిన. కానీ శుక్రవారం రాత్రి వడగళ్ల వర్షం రావడంతో పంట మొత్తం నేలరాలడంతో దాదాపు రూ. 3 లక్షల వరకు నష్టం వాటిల్లింది. పంట సాగుకు చేసిన అప్పులు ఎలా తీర్చాల్లో అర్థం కావడం లేదు. ప్రభుత్వమే పంట నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

– మురారి, రైతు, తీలేర్

ఆరబెట్టిన ధాన్యం తడిసింది



12 ఎకరాల పంటను కోత వేసి ఆరబెట్టిన ధాన్యం అకాల వర్షానికి మొత్తం తడిసిపోయింది. తడిసిన ధాన్యాన్ని మళ్లి ఎండకు ఆరబెట్టేందుకు కూలీల ఖర్చు ఎక్కువ అవుతోంది. వారం రోజుల పాటు ఎండిన ధాన్యం ఒక్క రాత్రిలో మొత్తం తడిసిపోవడంతో బాధగా ఉంది.

– బుచ్చప్ప, రైతు, పెద్దచింతకుంట

వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



నారాయణపేటలో కౌన్సెలింగ్ ఇస్తున్న వైద్యులు

నారాయణపేట రూరల్: హైదరాబాద్ ఇందిరా ఐవీఫ్ ఆస్పత్రి లిమిటెడ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక గీత మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో నిర్వహించినట్లు వైద్య బృందం తెలిపారు. హైదరాబాద్కు చెందిన ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్లు శిరీష, ఐషా, ఫాతిమా, గీత 40మంది పిల్లలు లేని స్త్రీలకు కౌన్సిలింగ్ ఇస్తూ తగు సూచనలు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ పిల్లలు లేని దంపతులు సరైన సమయంలో సంబంధిత వైద్యులను సంప్రదించి ప్రత్యేక పరీక్షలు చేయించుకుని, మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఎగ్జిక్యూటివ్ సనిఉల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

విజయవంతం చేయండి



కరపత్రం విడుదల చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

మాగనూర్ (మక్తల్): మక్తల్ మండలంలోని అనుగొండ గ్రామంలో ఈనెల 7వ తేదీన లయన్స్ క్లబ్, మక్తల్ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ శశికాంత్, లక్ష్మణ్ సహకారంతో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు అధ్యక్షుడు టీవీ చారి తెలిపారు. వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలను శనివారం విడుదల చేశారు. శిబిరానికి మలక్‌పేట యశోద ఆస్పత్రి వైద్య సిబ్బందితో పాటు అన్ని విభాగాలను సంబంధించి ఇతర వైద్య నిపుణులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు అంజన్‌ప్రసాద్, అనుగొండ శ్రీనివాస్, సూగురు జైపాల్‌రెడ్డి, నాగరాజు, మామిళ్ల పృథ్వీరాజ్, శరణప్ప, రవికుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

‘కష్టపడే వారికే పార్టీ పదవులు’



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

నారాయణపేట: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పథకాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, పేదలకు లబ్ధిచేకూర్చేందుకు కష్టించి పనిచేసే వారికే పార్టీ పదవులు దక్కుతాయని పార్టీ నాయకుడు బండి వేణుగోపాల్ స్పష్టం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని 22వ వార్డు సికిల్‌గేరి ప్రాంతంలో ఏర్పాటు చేసిన బస్తీవాసులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ సారథ్యంలోనే సామాన్యులకు మౌలిక వసతుల కల్పన సాధ్యమవుతుందన్నారు. కులగణన అత్యంత పారదర్శకంగా నిర్వహించి దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టే విధంగా చేసిన సీఎం రేవంత్‌రెడ్డి దేశానికే దిక్సూచిగా నిలిచారన్నారు. కులగణన వల్ల ఓబీసీలు సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగ స్థితిగతులు తెలపడమే కాకుండా ఇప్పటి వరకు ప్రభుత్వపరంగా పొందిన, పొందాల్సిన అవసరాలను గుర్తించే భాగ్యం కలుగుతుందన్నారు. అనంతరం పార్టీ పట్టణ అధ్యక్షుడు మహ్మద్‌సలీం సమక్షంలో 22వ వార్డు కాంగ్రెస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజేశ్ గట్, ఉపాధ్యక్షులుగా మహ్మద్‌అవి, సదాత్, ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్ అత్తర్‌సాజిద్, కార్యదర్శులుగా విజయ్‌కుమార్, మహ్మద్ ఉస్మాన్ హజారి, ప్రత్యేక ఆహ్వానితులుగా వాహిద్‌మోల్, సందీప్ కళ్యాణి, నారాయణరావు మిస్కిన్, మోచి బాలప్పను నియమించారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మన్ సుధాకర్, సరాఫ్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విలువైన ప్రభుత్వ భూములు కాపాడాలి

కృష్ణా: మండలంలోని హిందూపూర్ శివారులో రోడ్డు పక్కన ఉన్న గల అసైన్డ్ భూములు అన్యాక్రాంతం కాకుండా ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని హిందుపూర్ గ్రామస్తులు డిమాండ్ చేశారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఆర్ అండ్‌బీ రోడ్డు పక్కన ఉన్న 84 సర్వే నెంబర్‌లోని అసైన్డ్, ప్రభుత్వ భూముల్లో కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా ఇటుకల బట్టీలను ఏర్పాటు చేశారన్నారు. ఈ విలువైన భూములను తక్షణమే ప్రభుత్వం స్వాధీనం చేసుకొని భూమి లేని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 28న కలెక్టర్ సిక్తా పట్నాయక్ కృష్ణాకు వచ్చిన సమయంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వగా.. ఆమె సానుకూలంగా స్పందించారన్నారు. ఈ విషయంలో రెవెన్యూ అధికారులు స్పందించకపోతే ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని గ్రామస్తులు హెచ్చరించారు.

చెరువులోని ఒండ్రు మట్టి తరలింపు

హిందూపూర్, కున్సీ గ్రామ శివారులో గల చెరువుల్లోని విలువైన ఒండ్రు మట్టిని రాత్రి వేళల్లోకి ఇటుకల బట్టీలకు తరలించారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని హిందూపూర్ గ్రామస్తులు తెలిపారు. ఇతర రాష్ట్రాలకు చెందిన కొందరు కాంట్రాక్టర్లు స్థానిక నాయకులకు ముడుపులు అందించి ప్రభుత్వ భూముల్లో ఇటుకల బట్టీలను ఏర్పాటు చేశారని మండిపడ్డారు. ఈ విషయంలో అధికారులు తగు చర్యలు తీసుకోకపోతే గ్రామస్తుల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు.



ఇటుల బట్టీ కోసం తెచ్చిన ఒండ్రు మట్టి కుప్పలు

క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయి

కోస్గి రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ప్రావీణ్యం సాధించాలని, క్రీడలు మానసికోల్లాసం కల్గిస్తాయని సీఎంఓ రాజేంద్రకుమార్ అన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో శనివారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న వేసవి శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ యోగా, పెయింటింగ్, డ్యాన్స్‌పై 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులు సుమారు వంద మందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. అనంతరం పిల్లలు వేసిన పెయింటింగ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ శంకర్ నాయక్, యాదయ్యశెట్టి తదితరులు ఉన్నారు.

నారాయణపేట ఎడ్యుకేషన్: పట్టణంలో మినీ స్టేడియంలో వేసవి క్రికెట్ శిబిరం మే 9న ప్రారంభించనున్నట్లు మహబూబ్‌నగర్ జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. ఈ క్రికెట్ శిక్షణ శిబిరానికి 9 నుండి 23 ఏళ్ల వయసు ఉన్న బాలబాలికలు మే 8 వరకు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు వ్యాయామ ఉపాధ్యాయులు రమణ, ఫోన్ నంబర్ 91007 53683 సంప్రదించాలని సూచించారు. క్రీడాకారులకు నెట్స్, జంబుకిట్స్, ఫిట్‌నెస్ సామగ్రితో పాటు ప్రతిరోజు అరటి పండ్లు, బిస్కెట్లు సమకూరుస్తున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు ఉమ్మడి జిల్లా స్థాయి లీగ్ పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం ఉందని, అదేవిధంగా జూన్ 25 లో నిర్వహించే హెచ్‌సీఏ లీగ్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు సన్మానం



ఊట్కూరు: మండలంలోని పెద్ద జట్రంలో పదో తరగతి ఫలితాల్లో మండల టాపర్లుగా నిలిచిన విద్యార్థులను శనివారం తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మండల టాపర్‌గా శిరీష 560, ద్వితీయ స్థానంలో బాలకృష్ణ 555 మార్కులు సాధించారు. కార్యక్రమంలో తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ, నాయకులు నర్సింగప్ప, కిరణ్, గోపాల్, భాస్కర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



మద్దూరు: మండల మహిళా సమాఖ్య నూతన కార్యవర్గాన్ని శనివారం మండల మహిళా సమాఖ్య భవనంలో ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా పద్మ, కార్యదర్శిగా భాగ్యమ్మ, కోశాధికారిగా శశికళ, ఉపాధ్యక్షురాలిగా సరోజ, సహాయ కార్యదర్శిగా యశోదమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అంతకముందు మహిళా సమాఖ్య ఈసీ సమావేశం, సమాఖ్య చేపట్టే కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో డీపీఎం అనంద్, ఏపీఎం నారాయణ, వివిధ గ్రామాల మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు అండగా షీ టీం

నారాయణపేట రూరల్: రాష్ట్రంలో మహిళలకు అండగా షీ టీం ఉందని కానిస్టేబుల్ బాలరాజు అన్నారు. పట్టణంలోని కొత్త బస్టాండ్ ఆవరణలో శనివారం సాయంత్రం ప్రయాణికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బస్సుల్లో ప్రయాణం చేసేటప్పుడు, బస్టాండ్‌లో పోకిరీలు ఎవరైనా ఈవ్ టీజింగ్‌కు పాల్పడిన, మాయమాటలతో సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు అనుమానం వస్తే డయల్ 100 కు సమాచారం ఇవ్వాలని కోరారు. అధికారులు, ప్రజాప్రతినిధుల డీపీలతో వాట్సాప్ కాల్ చేసి డబ్బులు పంపమని అడిగితే నిరాకరించాలని, తక్కువ ధరలకు వస్తువులు, వాహనాలు అమ్ముతామని, లాటరీల పేరుతో మోసం చేసేవారి నుంచి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని లింకులను ఓపెన్ చేయకుండా ఉండడం వల్ల సైబర్ నేరాలను అరికట్టే అవకాశం ఉంటుందన్నారు. సైబర్ నేరాలకు గురైతే టోల్ ఫ్రీ నెంబర్ 1930 కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. బస్సుల్లో ప్రయాణం చేసే సమయంలో విలువైన వస్తువులు, డబ్బులను జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జ్యోతి, కవిత పాల్గొన్నారు.



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న షీ టీం సభ్యులు

అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి స్వర్ణోత్సవాలు

మాగనూర్ (మక్తల్): అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో 50 వేదికలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా శనివారం హైదరాబాద్‌లోని కొత్తపేట, దిల్‌సుఖ్ నగర్‌లో గల బాబు జగ్జీవన్‌రామ్ ఆడిటోరియంలో వ్యవస్థాపక అధ్యక్షుడు రాజేష్‌పాండే గురుస్వామి, గౌరవ సలహాదారులు పి కేశవశర్మ గురుస్వామి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానిస్తూ మెమొంటోలు, అయ్యప్ప సాహిత్యాన్ని అందించారు. ఈ సందర్భంగా రాజేష్‌పాండే గురుస్వామి మాట్లాడుతు.. ‘నీ ఘనమే నా ప్రాణం’ కార్యక్రమంలో భాగంగా నిరంతరం 12 గంటల భజన కార్యక్రమం మొదటి సారిగా ప్రారంభించినప్పుడు అందరూ ఇది సాధ్యమేనా అంటూ ఆశ్చర్యపోయారన్నారు. నేడు ఇదే కార్యక్రమాన్ని ఏమాత్రం సమయం లేకుండా కేవలం 12 గంటలకే కాకుండా 24 గంటలు , 36 గంటలు సైతం నిర్వహించిన సందర్భాలు ఉన్నాయని తెలిపారు. అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపడుతున్న నిర్వాహకులను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో మక్తల్, జక్లేర్, గుడిగండ్లకు సంబంధించిన గురుస్వాములు అశోక్‌గౌడ్, చంద్రకాంత్‌గౌడ్, అనిల్, టీపీ బాబు, పాదయాత్ర రాజు, కావలి అంజనేయులు, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.



స్వర్ణోత్సవ సంబరాల్లో పాల్గొన్న అయ్యప్ప దీక్ష ప్రచార సమితి సభ్యులు

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



డెంగ్యూ సర్వే చేపడుతున్న వైద్య సిబ్బంది

ఊట్కూరు: ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే అందరూ ఆరోగ్యంగా ఉంటారని వైద్య సిబ్బంది సంతోష్ సూచించారు. ఊట్కూరులోని గాంధీనగర్ వీధిలో వ్యక్తికి డెంగ్యూ నిర్ధారణ కావడంతో శనివారం వైద్య సిబ్బంది జ్వర సర్వే చేపట్టారు. గాంధీనగర్ కాలనీలో ఇంటింటికీ వెళ్లి దోమల నివారణ కోసం ఇళ్ల పరిసరాలలో స్ప్రే చేశారు. చుట్టుపక్కల 50 ఇళ్లలో సర్వే చేపట్టి జ్వర బాధితుల వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది సంతోష్ మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో మురుగునీటి గుంతలు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ముళ్ల పొదలు తొలగించాలని సూచించారు. ప్రతి శుక్రవారం స్ప్రే డే ను నిర్వహించడం వల్ల దోమల ఉత్పత్తిని అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, నర్సింహులు, చంద్రశేఖర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నారాయణపేటలో మెగా జాబ్ మేళా

నారాయణపేట: పట్టణంలోని ఎస్ఆర్ గార్డెన్స్‌లో భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్‌కుమార్ రెడ్డి నేతృత్వంలో శనివారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు జిల్లా కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన వందలాది మంది నిరుద్యోగ యువత హాజరయ్యారు. అంతకుముందు తనకు విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులచే డాక్టర్ రాజ్‌కుమార్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేయించి కార్యక్రమం ప్రారంభించారు. ఈసందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ నారాయణపేట జిల్లాలో ఉన్న నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు డాక్టర్ కె.రాజ్‌కుమార్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని కొనియాడారు. ఇప్పటికే పేద విద్యార్థులకు ఆర్థికసాయం, ల్యాప్‌ట్యాప్‌ల అందజేత, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందించడం, అనేక ఆలయాల పునర్నిర్మాణాలకు సహకరిస్తున్నారన్నారు. శనివారం ఏర్పాటు చేసిన ఉద్యోగ మేళాలో 380 మంది ఉద్యోగాలకు ఎంపికకాగా.. వారిలో 80 మందికి భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ రాజ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. అంతకుముందు నిర్వాహకులు వివిధ కంపెనీల ప్రతినిధులు, అధ్యాపకులు, ఫౌండేషన్ సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు మణిమాల, వేణుగోపాల్, అంజయ్య, ఫౌండేషన్ సభ్యులు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



యువతకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేసిన రాజ్‌కుమార్‌రెడ్డి

ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలపై అనాసక్తి

- ముందుకు రాని లబ్ధిదారులు
- అవగాహన కల్పిస్తున్న అధికారులు
- ఇళ్లు నిర్మించుకోమని అధికారులకు కాగితాలు రాసిస్తున్న వైనం

అమరచింత: ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకోమని లబ్ధిదారులు ఏకంగా గ్రామానికి వచ్చిన అధికారులకు ‘ఇందిరమ్మ ఇళ్లు మాకొద్దు’ అని కాగితాలపై రాసిస్తున్న పరిస్థితి మండలంలోని చింతరెడ్డిపల్లిలో శనివారం చోటుచేసుకుంది. ఎంపీడీఓ చెన్నమ్మ ఆధ్వర్యంలో అధికారులు శనివారం గ్రామానికి చేరుకుని ఇందిరమ్మ ఇల్లు మంజూరయిన వారితో ఇంటి నిర్మాణాల పురోగతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరయిన ఐదుగురు లబ్ధిదారులు తమకు ఇళ్లు వద్దని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మాణం సాధ్యం కాదంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. మండలంలోని చింతరెడ్డిపల్లి గ్రామాన్ని మోడల్ విలేజ్‌గా ఎంపిక చేసి 24 మంది లబ్ధిదారులను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసింది. మూడు నెలల కాలంలో వీరిలో కేవలం నలుగురు మాత్రమే ఇళ్లు నిర్మించుకుంటుండగా.. మిగిలిన వారందరూ ఆసక్తి చూపడం లేదు.



చింతరెడ్డిపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ చెన్నమ్మ

సురక్షిత ప్రయాణం చేద్దాం

ఆత్మకూర్: సురక్షిత ప్రయాణంతో క్షేమంగా ఉంటామని, వాహనదారులు, ప్రయాణికులు రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని లేని పక్షంలో చర్యలు తప్పవని సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్ అన్నారు. శనివారం రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా వాహనదారులకు, ప్రయానికులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని, అనుమతి పత్రాలు వెంట ఉంచుకోవాలని, హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్‌లో మద్యం తాగరాదని, ఇన్సూరెన్సు, నంబర్‌ప్లేట్లు ఉండాలని, తదితర విషయాల గురించి క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రోషయ్య, హెచ్‌సీలు బాలీశ్వర్‌రెడ్డి, రవీందర్, సిబ్బంది బాలరాజు, రమేష్, రామకృష్ణ, గుప్త, రాములు, వాహనదారులు, ప్రయానికులు పాల్గొన్నారు.



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు